

# రెండు కాళ్ళ జంతువు

పూర్వం ఒక అడవిలో ఒక సింహం వుండేది. ఒక నక్క దానికి ప్రాణ మిత్రంగా వ్యవహరించేది ఒకనాడు సింహం తన గుహలో దిగులుగా కూర్చుని వుండటం చూసి, నక్క దాని దగ్గరకు వెళ్ళి, 'ప్రభూ! ఎందుకంత విచారంగా వున్నారు?' అనడిగింది.

అందుకు సింహం పేలవంగా నవ్వి. "ఏముంది? వయసు మళ్ళింది కదా? విచారించక ఏం చేయమంటావు?" అనడిగింది.

నక్క నొచ్చుకుని. "అదేమిటి ప్రభూ! అలా నిరాశ చెందుతున్నారు? మీకిప్పుడు ఏం తక్కువైందని? ఏం జరిగిందని?...." అనడిగింది ఆతృతగా.

సింహం మరోసారి పేలవంగా నవ్వి, "ఎక్కడ లేని నీరసమూ పట్టుకున్నది. వేటాడటానికీ ఆహార సంపాదనకూ కూడా ఇబ్బంది పడిపోతున్నాను. అలాగని ఎంగిలి తిండి తినే అలవాటు లేదుగా!" అన్నది బాధగా.

"నేనుండగా మీరిలా చింత పడటం బాగా లేదు ప్రభూ! మీకు వేటాడే శక్తి లేకపోవచ్చు. దగ్గర కొచ్చిన ప్రాణిని సంహరించే శక్తి ఇంకా వున్నదిగా!" అన్నది నక్క.

"ఎందుకు లేదూ! అయితే నన్ను చంపి తిను అంటూ దగ్గరకొచ్చే జంతువు ఎక్కడున్నది?" అంటూ నిరుత్సాహపడింది సింహం.

"ఉంది మహారాజా! రెండు కాళ్ళ జంతువు మానవుడు!!" అంటూ నవ్వింది నక్క.

"బుద్ధి లేకుండా మాట్లాడకు. మానవుడు ఎంతో తెలివైనవాడు" అన్నది సింహం కోపంగా.

"మానవుడు తెలివైనవాడే! నేను కాదనను కాని మానవుడికి ఒక బలహీనత వున్నది. దురాశ

పరుడై వివేకం కోల్పోయి బుద్ధిలేని పనుల్ని అనేకం చేస్తుంటాడు. మీరు కంగారు పడకండి. నేనొక మానవుడ్ని మీ దగ్గకు పిలుచుకు వస్తాను. ఎలా పిలుచుకు వస్తానన్న విషయాన్ని నాకు వది లేయండి. ఎటొచ్చి నా వెంట వస్తున్న ఆ మానవుడ్ని దెబ్బతీయటం మీ వంతు" అంటూ వివరంగా చెప్పింది నక్క.

సింహం సరే అలాగే కానిమ్మని నక్కకు తన అంగీకారం తెలిపింది.

నక్క గుహలో ఒక మూలగా పడివున్న ఒక వజ్రాల హారాన్ని మెడలో వేసుకుని బయల్దేరింది. అలా బయల్దేరిన నక్కను చూసి తనలో తాను నవ్వుకున్నది సింహం.

వజ్రాలహారాన్ని మెడలో అలంకరించుకున్న నక్క మానవ ప్రాణి కోసం వెతుక్కుంటూ బయల్దేరింది. అలా అలా కొంత దూరం పోగా పోగా ఒకచోట ఒక దొంగ ఒక పొదచాటుగా కనబడ్డాడు. నక్క అతన్ని చూసి ఎంతో సంబర పడిపోయి అతన్ని సమీపించింది. సరిగ్గా అదే సమయంలో దొంగ కూడా నక్కను చూశాడు. దాన్ని చంపి దాని మెడలోని హారాన్ని దక్కించు కోవాలన్న తలంపుతో దొంగ తన వద్ద వున్న విల్లును చేతబట్టి బాణాన్ని ఎక్కుపెట్టాడు.

నక్క వెంటనే, "ఆగవయ్యా నాయనా! హారం



కోసమేగా నువ్వు నన్ను చంపబోయేది? ఎంత బుద్ధిలేని వాడివయ్యా చోరవీరా! అడిగితే నేనివ్వనా?" అన్నది.

"నిజంగానా! అడిగితే ఇస్తావా?" అంటూ విస్మయంతో అడిగాడు దొంగ.

"ఈ ఒక్కటేమిటి? నిజంగా నీకు కావాలంటే నువ్వు అడిగినన్ని ఇస్తాను. నాతో పాటురా!" అని చెప్పింది నక్క.

"నీ వెంట ఎక్కడకు రావాలి? ఏ నిధైనా నీ కంట బడిందా?" అనడిగాడు దొంగ.

"నిధి కాదు, పెన్నిధి అనుకో. ఇక్కడకు దగ్గర్లో ఒక దిగంబర స్వామిగారు వుంటున్నారు. పరుసవేది ప్రభావంతో ఆయన కంటబడిన ఇనుమునల్లా బంగారంగా మారుస్తున్నారు.

ఆయన వుండే రహస్య గుహ నిండా బంగారం కుప్పలు కుప్పలు" అన్నది నక్క అతన్ని ఊరిస్తూ.

"సరే! పద నీతో పాటు వస్తాను. నీ మాటలు అబద్ధమైతే మాత్రం ఒకే ఒక్క బాణంతో నిన్ను కూలుస్తాను" అన్నాడు దొంగ హెచ్చరిస్తూ.

"కూలుస్తావో.... ఆ బంగారు కుప్పలు చూపిన నన్ను దైవంగా కొలుస్తావో నీకే తెలుస్తుందిలే.... రా...." అంటూ నక్క బయల్దేరింది.

నక్క వెంట దొంగ బయల్దేరాడు. నక్క అతన్ని సింహం గుహ లోపలికి తీసుకుపోయింది. ఆ సందర్భం కోసమే ఎదురు చూస్తున్న సింహం దొంగ మీద పడి తన కాలి పంజాతో అతని తలమీద బలంగా కొట్టింది. ఆ దెబ్బతో దొంగ తల పగిలింది. మెదడు ఎగిరిపోయి దూరంగా పడింది.

నక్క ఆ మెదడును అలాగే అందుకుని స్వాహా చేసింది. అంత వేడి వేడి మెదడును, అమృతం లాంటి మానవుడి మెదడును ఆరగించటానికి తానెంతో పుణ్యం చేసుకున్నట్లు భావించింది నక్క.

దొంగను ఆరగిస్తున్న సింహానికి కొంతసేపటి తర్వాత గాని అతని తలలో మెదడు లేని సంగతి గుర్తుకు రాలేదు. "వీడికి మెదడు లేదా?" అనడిగింది నక్కను.

నక్క పక పకా నవ్వింది. "మహా ప్రభూ! మెదడే వుంటే వీడు నా వెంట పడి వచ్చేవాడా? నేను మీకు ముందే చెప్పాను కదా! మెదడు లేని వాళ్ళే మనకు దక్కేది" అన్నది.

సింహం ఆ నాటికి ఏదో ఒక ఆహారం దొరికి ఆకలి తీర్చుకున్నందుకు సంతృప్తి పడుతుండగా నక్క మరో మెదడు కోసం అన్వేషిస్తూ బయల్దేరింది.

